


## కూటమి ప్రభుత్వ ధ్యేయం...
# పేదవాడి సంక్షేమం



పెళ్లకూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : పెళ్లకూరు మండలంలోని స్థానికంగా ఉన్న ఎంపీడీవో కార్యాలయం నందు శుక్రవారం నాడు నిర్వహించిన ప్రజాద ర్బార్ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వినతలను స్వీకరించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సూళ్లూరుపేటలో నిర్వహించే ఈ గ్రీవెన్స్ కు అన్ని మండలాల నుంచి ప్రజలు సూళ్లూరుపేటకు రావడం ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని ఇకనుంచి ప్రతి శుక్రవారం ఏదో ఒక మండలంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని అందులో భాగంగానే మొదటగా పెళ్లకూరు మండలంలో నిర్వహించడం జరుగు తుందని అన్నారు. ఈ గ్రీవెన్స్ లో ప్రజల నుంచి సుమారు 50 వినతులు వచ్చాయని వీటన్నింటికీ రెండు మూడు వారాల్లోనే పరిష్కారం చూపడానికి ప్రయత్నిస్తానన్నారు. ఈ సమస్యలన్నీ కూడా గత ప్రభుత్వ వైఫల్యాలు వల్లనే వచ్చాయని గత పాలకులు ప్రజా సమస్యలను పక్కనపెట్టి సంక్షేమం అంటూ ప్రచారం చేసుకున్నారు. మా ఈ కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి రెండు చేస్తున్నామన్నారు. ఇప్పుడు ప్రతిపక్షాలు మా ప్రభుత్వం పై యూరియా కొరత విషయంలో అసత్య ప్రచారాలు చేస్తూ రైతులను అనవసర భయాలకు గురి చేస్తున్నారు. అనంతరం అధికారులతో మీ శాఖలోని సమస్యలను నా దృష్టికి తీసుకుని వస్తే నేను వాటి పరిష్కారం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి రెండు మూడు వారాలలో పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈ గ్రీవెన్స్ లో ఎక్కువగా విద్యుత్తు, రెవెన్యూ భూ సమస్యలు,గృహ నిర్మాణాలుపై వినతలు రావడం జరిగింది. నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దల నరేందర్‌రెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య బిజెపి మండలాధ్యక్షులు కలిచేటి నరసింహులు స్వర్ణముఖి నది ఆనకట్ట చైర్మన్ ప్రసాద్ నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు పేరం రమేష్ నాయుడు, పిఏసిఎస్ చైర్మన్ కె.వి నాయుడు,తహాశీల్దార్ సిహెచ్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీల రాణి, ఎం ఈఓలు, బి.వెంకటేశ్వర్లు ఎం.శంకరయ్య మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దేశంలో రెండో అతి పెద్ద...
# ఇండస్ట్రీయల్ టౌన్‌షిప్‌గా శ్రీసిటీ

**-సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ శ్రీసిటీ ఎండీ**




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, నవంబరు 14 ప్రభాతవార్త: భారతదేశ ఆర్థికాభి వృద్ధిలో జపాన్‌సంస్థల పెట్టుబడులు విస్తరిస్తూ భారత్-జపాన్ పారిశ్రామిక బంధం మరింత బలపడుతోందని, ఇందులో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు శ్రీసటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో భారత్-జపాన్ భాగస్వామ్యం, సెషన్‌లో ఆయన ప్యానెలిస్ట్‌గా పాల్గొన్నారు. జేసీసీఐసీ చెన్నై ప్రెసిడెంట్ అకిరా హాంజావా, జెట్రో చెన్నై డైరెక్టర్ జనరల్ కౌరు షిరయిషి, ఇతర ప్యానెలిస్టులుగా పాల్గొనగా సీఐఐ జాతీయ కమిటీ చైర్మన్ రాక్‌వెల్ ఆటోమేషన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ సాహ్నీ సెషన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శైలి మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేయగా, భారత్ లోని జపాన్ రాయబారి హనరబుల్ ఓనో కేయిచి ప్రత్యేక ప్రసంగం చేశారు. ఎఫ్ఎంసీటీ వస్తువులు, వివిధ ఎయిర్ కండిషనర్, బ్రాండ్లు, ఆటో మొబైల్ భాగాలు, వీల్‌చైర్లు, ఇసుజు వాహనాలతో సహా మేడ్, శ్రీసిటీ ఉత్పత్తుల ప్రదర్శన ప్రతినిధులను ఆకర్షించింది. దీనిని సందర్శించిన దౌత్యవేత్తలు, మంత్రులు, పరిశ్రమల ప్రతినిధులు శ్రీసిటీ విలక్షణమైన సమగ్ర అభివృద్ధి నమూనాను ప్రశంసించారు.

## చర్చి భూములను...
# తన్నుకుపోయిన పారిశ్రామికవేత్త!

**-రైతుల సంక్షేమం అంటూ బ్యాంకు నుండి 36 కోట్లు రుణం -మా భూములు అమ్మడానికి ఎవరికి హక్కు లేదు... క్రైస్తవుల ఆవేదన**



చర్చి సంబంధించిన భూమి - తహశీల్దార్‌కు అర్జీ ఇస్తున్న శ్రీరాజ్

రేణిగుంట, నవంబర్ 13 ప్రభాతవార్త: రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ సర్వే నంబర్ 75,76 నందు దాదాపు 7 ఎకరాల చర్చికి సంబంధించిన భూములను ఓ పారిశ్రామికవేత్త తన తెలివితేటలను ఉపయోగించి చర్చి నిర్వాహకులు ఉండి కొనుగోలు చేశారు. మైనార్టీ ఆస్తులను కొనకూడదు, అమ్మకూడదు, అని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొన్నదని క్రైస్తవుల వాదన. అయినప్పటికీ సదరు పారిశ్రామికవేత్త తన పరపతిని ఉపయోగించి భూమిని సొంతం చేసుకొని అక్కడ వెంచర్ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మార్కెట్ రేటు ప్రకారం 100 కోట్ల విలువ చేసే భూమిని కేవలం మూడు కోట్ల రూపాయలకు కొన్నాడని క్రైస్తవుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే స్థలంలో రైతులకు గోడౌన్ నిర్మిస్తున్నట్లు బ్యాంకు నుండి 36 కోట్లు లోన్ తీసుకున్నట్లు సమాచారం. 2014 సంవత్సరం అప్పటి ఎస్ఏఎల్ సి (సౌత్‌ఆంధ్ర లూథరన్ చర్చి) చైర్మన్ వివాద చర్చి ఆస్తులుగా భావించే అక్కడి చర్చి భూములను అమ్మారని వ్యతిరేకవర్గం భూముల అమ్మకంపై కోర్టుకు వెళ్లినట్లు వాదిస్తున్నారు. దీంతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తరువాత ఇరు వర్గాలు రాజీపడి చర్చి ఆస్తులను తక్కువ ధరకు ఇచ్చారని బాధను వ్యక్తం చేస్తున్నారు. చర్చి ప్రాంగణంలోని ఆస్తులకు విశిష్ట స్థానం ఉంది. క్రీస్తు శకం 1890 బ్రిటిష్ పాలనలో కొందరు దొరలు ఇక్కడ చర్చిని ఏర్పాటు చేసి అద్భుతమైన గెస్ట్ హౌస్‌ను నిర్మించారు. ఇప్పటికీ గెస్ట్ హౌస్ శిథిలావస్థకు చేరుకొని చరిత్రకు సాక్షిగా ఉంది. చర్చి అనుసంధానంగా మూడు కాలువల ఆసుపత్రి, పిఎం హై స్కూల్ ఉన్నాయి. విద్యార్థులకు వసతి గృహ భవనాలు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. సదరు వసతి గృహంలో భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉండి చదువుకున్నట్లు అందరూ చెబుతారు. ఇక్కడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ అగరాల ఈశ్వర్‌రెడ్డి, ప్రముఖ సినీ నటుడు రంగనాథ్ చదువుకున్నట్లు సమాచారం. రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పాఠశాల ను సందర్శించడానికి వచ్చినప్పుడు చర్చి ఆస్తులను కాపాడాలని లిఖితపూర్వకంగా పత్రం ఇచ్చినట్లు అక్కడ వినిపిస్తుంది. అలాంటి చర్చి ఆస్తులను 1669/1954 నంబరు లింకు డాక్యుమెంట్ ద్వారా 7024/24/2015 నంబరుతో ప్రస్తుతం రిజిస్టర్ అయి ఉంది. చరిత్రకు సాక్షిగా నిలిచిన చర్చి ఆస్తులను ఎవరు అమ్మకూడదు అన్నది జగమెరిగిన సత్యం. అయితే చర్చికి కస్టోడియల్‌గా ఉన్న ఓ పాస్టర్ ఈ ఆస్తులను సదరు పారిశ్రామికవేత్తకు అప్పనంగా చాలా తక్కువ రేటుకు ముట్ట చెప్పినట్లు క్రైస్తవ సోదరులు ఆరోపిస్తున్నారు. అమ్మగా వచ్చిన డబ్బును ఎస్ఏఎల్‌సి అకౌంట్‌కు జమ చేశారా? జమ చేసిన డబ్బుతో చర్చి ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారా! అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ సమగ్ర సమాచారాన్ని గాజులమండ్యం మాజీ సర్పంచ్ శ్రీరాజ్ తన అర్జీలో పై విషయాలను పొందుపరుస్తూ రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై తహసిల్దారును వివరణ కోరగా మైనార్టీ ఆస్తులను అమ్మడం కొనడం నేరమన్నారు. అలా జరిగి ఉంటే సదరు స్థలంపై పూర్తి గా దర్యాప్తు జరిపి రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తక్షణం చర్యలు చేపడతామని ప్రభాతవార్త ప్రతినిధికి తెలిపారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు: ఆర్డీఓ



గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడుతన్న అర్డీఓ

చిత్తూరు, నవంబర్ 14 ప్రభాతవార్త: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు. జాతీయ బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కీర్తిశేషులు ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి అర్డీఓ శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పఠనాశక్తి పెంచడం గ్రంథాలయ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలు, చిన్న పిల్లలకు ఉపయోగపడే విధంగా పుస్తకాలు అందుబాటులో వున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలను చదువుకోవాలన్నారు. తాను ఈ స్థాయికి ఎదగడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. తాను వారంలో మూడు రోజుల పాటు గ్రంథాలయాలకు వెళ్ళి పుస్తకాలను చదువుకునే వాడినన్నారు. నవంబర్ 14 నుండి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు జరుపుకుంటున్నామని, చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లా వ్యాప్తంగా వున్న 70 శాఖా గ్రంథాలయాల్లో ఈ ఏడాది జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించుకోవడం సంతోషంగా వుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో వివిధ పోటీ పరీక్షల కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్క పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు కచ్చితంగా గ్రంథాలయంలో ఒక గంట వుండే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

జిల్లా కేంద్రం చిత్తూరులో జిల్లా గ్రంథాలయ కార్యాలయ భవన నిర్మాణ పనులు త్వరితంగా పూర్తి చేస్తున్నామన్నారు. అలాగే 115 పుస్తక పంపిణీ కేంద్రాల ద్వారా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా వున్న గ్రంథాలయాలు, జిల్లా కేంద్రంలో వున్న గ్రంథాలయంలో దాదాపు 6 లక్షల పుస్తకాలు ప్రజలకు అందుబాటులో వున్నాయన్నారు. అలాగే 66 వేల మంది గ్రంథాలయాల్లో సభ్యత్వం కలిగి వున్నారన్నారు. సంవత్సరంలో గ్రంథాలయాలను 1.09 లక్షల మంది సందర్శిస్తున్నార న్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం, మండలాల్లోని శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థిని విద్యార్థులు వివిధ అంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంవి శ్రీధర్‌రెడ్డి, సంబంధిత అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సిఐడి అధికారులే షాక్ !

**మాజీఏవిఎస్‌ఓ సతీశ్ మృతి కలకలం**
**-కుట్రలో భాగమేనంటున్న పలువురు**




తిరుపతి,నవంబర్ 14ప్రభాతవార్త: శ్రీవారికి భక్తులు సమర్పించే కానుకలు లెక్కించే పరకామణిలో చోరీ కేసు సిఐడి విచారణ చేస్తున్న సమయంలో కీలక ఫిర్యాదిదారుడు, మాజీ ఏవిఎస్‌ఓ వై.సతీశ్‌కుమార్ అనుమానాస్పద మృతి సంఘటన సిఐడి అధికారులను షాక్‌కు గురి చేసింది. శుక్రవారం విచారణకు అనంతపురం జిల్లా గుత్తినుండి రైల్లో వస్తున్న ఆయన కోమలి ప్రాంతంలో రైల్వేట్రాక్ పక్కన మృతిచెందడం దిగ్భ్రాంతికి గురిచేసింది. విచారణకు వస్తున్న ఆయనను హత్యచేశారా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనేది మిస్టరీగా మారింది. అయితే రైల్లోప్రయాణిస్తున్న ఆయన తెల్లవారుజామున ఇలా ప్రాణాలు కోల్పోవడం పోలీసుశాఖలో పెద్ద సంచలనంగా మారింది. ఆయన మృతిసంఘటన విస్తుగొలిపిస్తోంది. నిందితుడైన రవికుమార్ పరకామణి భవనంలో పర్యవేక్షణ చేసే డిప్యూటీ ఇఒ, సూపరింటెండెంట్, విజిలెన్స్‌విభాగం అధికారులను మభ్యపెట్టి పెద్దజీయంగార్ అండతో ఆడిందే ఆట చేసిందే చోరీ అన్నట్లు ఎవరినీ లెక్కచేయనితనంగా వ్యవహరించాడనేది సిఐడి అధికారులు తెలుసుకున్న విషయాలు. ఈ విషయాలతో ఎంతకాలంగా పరకామణిలో చోరీ చేస్తున్నాడనేది మాత్రం ఆరా తీస్తున్నారు. ఇదే కోణంలో సిఐడి అధికారులు విచారణ వేగవంతం చేసిన సమయంలో ఈ కేసు కీలకదశలో మాజీ ఏవిఎస్‌ఓ సతీశ్‌కుమార్ మృతిపై అనుమానాలు నెలకొన్నాయి. రవికుమార్‌కు చెందిన కొన్ని ఆస్తులను 41కోట్ల రూపాయలు విలువైనవి విరాళంగా టిటిడి తీసుకుంటున్నట్లు అప్పట్లోనే వెల్లడించి 2023 సెప్టెంబర్ 9న లోక్‌అదాలత్‌లో కేసు రాజీచేయించే వరకు కుట్రదాగి ఉందనేది,ఇప్పుడు మాజీ ఏవిఎస్‌ఓ సతీశ్‌అనుమానాస్పద మృతి వెనుక కుట్ర ఉందనేది వెలుగుచూడనుంది. అయితే భిన్నాభిప్రాయాలు వ్యక్తమ వుతున్నా పోలీస్ అధికారి ఆత్మహత్య కాదని,హత్యగానే పోలీసువర్గాలు భావిస్తున్నాయి. ఆయనను రైల్లోనే హతమార్చి కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేశారనేది పోలీసువర్గాల్లో గుప్పుమంటోంది. రైలుక్రిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లయితే శరీరం మొత్తం ముక్కలుముక్కలుగా చితికిపోయి ఉంటుందని, రైల్లోంచి దూకేసినా ముఖం గుర్తుపట్టలేని విధంగా మారాలని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హతమార్చి ఇలా చిత్రీకరించారనేది బలమైన అనుమానాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో పరకామణిలో సివి రవికుమార్ 2023 ఏప్రిల్‌లో జరిగిన చోరీ కేసులో విజిలెన్స్ ఏవిఎస్‌ఓ సతీశ్‌కుమార్ పట్టుకోవడం జరిగింది. తదనంతరం పరిణామాలతో రాజీచేసుకున్నారు. ఈ కేసులో హైకోర్టు ఆదేశాలతో ప్రస్తుతం సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్ నేతృత్వంలో విచారణ సాగుతోంది. విచారణలో భాగంగా కీలకమైన సతీశ్‌కుమార్ తిరుపతికి వస్తున్న సమయంలో ఈ దారుణం జరగడం వెనుక కుట్ర ఉందనేది వ్యక్తమవుతోంది. నిందితుడికి తిరుపతి, చెన్నై, కర్నాటక, హైదరాబాద్‌లో ఆస్తులు ఉన్నట్లు సమాచారం సేకరించిన సిఐడి విచారణ చేస్తుండగా ఇటీవల రవికుమార్ తరపున న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను టిటిడి ఉద్యోగి కానని, కేవలం మఠం తరపున ఉన్నవాడినని, తన ఆస్తులపై దర్యాప్తు చేపట్టడాన్ని నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. న్యాయవాది పిటిషన్‌పై ధర్మాసనం పిల్,పిటిషన్‌ను కలిపి విచారణ చేస్తామని, రెండువారాలు గడువు విధించింది. ఇదే సమయంలో శుక్రవారం విచారణకు వస్తున్న మాజీ ఏవిఎస్‌ఓ సతీశ్‌కుమార్ అనుమానాస్పద మృతితో ఏం జరగనుందనేది మాత్రం ఊహించలేకపోతున్నారు.

# ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్

**- ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

గూడూరు, నవంబర్ 14 ప్రభాతవార్త: గూడూరు నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలు తెలియజేసేందుకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని దీనిలో వచ్చిన అర్జీలను పి ఫోర్ ద్వారా ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని ఒక వారంలో ఆ సమస్య పరిష్కారం పై అర్జీదారునికి తెలియజేయడం జరుగు తుందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల నుండి ప్రజలు వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేశారు కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు వచ్చిన అర్జీలను ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన పి-ఫోర్ ద్వారా ఆన్లైన్ ప్రక్రియను ఎమ్మెల్యే ప్రారంభించారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు తెలియజేసిన సమస్యలను నూతనంగా పి4 వర ప్రభుత్వానికి పంపించడం జరుగుతుంది అని సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అర్జీదారని వారంలోపు సమస్య పరిష్కారం పై తెలియజేసేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు రెవిన్యూ శాఖలో ఎక్కువగా సమస్యలు వస్తున్నాయని వాటిని పరిష్కరించడంలో అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఎలక్ట్రికల్ ఈ ఈ నరేందర్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, పెంచలయ్య, సునీల్, తదితరులు పాల్గొన్నారు.



# పదిలం పదిలం పసిహృదయం

**పసిపిల్లల గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవాలి**
**- స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

తిరుపతి హెల్త్, నవంబర్ 14 ప్రభాతవార్త : భారతదేశంలో ప్రతి 1000 మంది చిన్నారులలో 8 మందికి పుట్టుకతో గుండె జబ్బులు వచ్చే అవకాశాలు వుంటాయని, అందులో 90 మందికి ఆపరేషన్లు చేయాల్సిన అవసరం రావచ్చునని, అందువల్ల ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకుని చిన్నపిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ కోరారు. నవంబర్ 14వ తేది బాలల దినోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సి.టి.సర్జరీ విభాగం ఆధ్వర్యంలో పదిలం పదిలం పసిహృదయం, చిన్న పిల్లల గుండె జబ్బులపై అవగాహన పేరిట శ్రీ పద్మావతి హాస్పిటల్, ఓ.పి.డి. బ్లాక్ నందు రెండు రోజుల పోస్టర్ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన వుంటుందని, ఆసుపత్రికి వచ్చే రోగులు, వైద్య విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించి అవగాహన పెంచుకోవాలని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్వి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్ సత్యనారాయణ గారి చేతుల మీదుగా పదిలం పదిలం పసిహృదయం అనే పుస్తకాలను వైద్య విద్యార్థులకు పంపిణీ చేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్.వి.కుమార్, ఎస్.వి. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్. సత్యనారాయణ, డీన్ డా అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్లా, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, మెడిసిన్ విభాగాధిపతి డా.అల్లాడి మోహన్, కార్డియాలజీ విభాగాధిపతి డా. రాజశేఖర్, సి.టి. సర్జరీ విభాగాధిపతి డా. సత్యవతి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా కె.నాగరాజ్, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ శ్రీహరి రావు, సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులకు అవసరాన్ని బట్టి 3 నుండి 4 ఆపరేషన్లు కూడా చేయాల్సి రావచ్చని, ముందు జాగ్రత్తగా వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకుంటే మిగిలిన జీవితం మొత్తం సంతోషంగా గడపవచ్చునని సూచించారు. పుట్టుకతో వచ్చే గుండె జబ్బులపై వైద్య సిబ్బందితో పాటు, నర్సులు, టెక్నీషియన్లు, మెడికో సోషల్ వర్కర్లు, సైకాలజిస్టులు, ఉపాధ్యాయులు అవగాహన పెంచుకొని, తెలియని వారికి తెలియజెప్పాలన్నారు. సుశీలమ్మ, శ్రీనాధరావు పేరిట శ్రీనాథ సహృదయ సాహితి పేరిట సంస్థను స్థాపించి, పదిలం పదిలం పసిహృదయం అనే పుస్తకాన్ని ముద్రించినట్లు తెలిపారు. ఇందులో గుండె జబ్బులు ఎందుకు వస్తాయి, ఎలా గుర్తుపట్టాలి, ఎలాంటి ఆపరేషన్లు చేస్తారు తదితర అంశాలతో అందరికీ సులువుగా అర్థమయ్యేలా సరళమైన భాషలో సమగ్రమైన సమాచారం అందించినట్లు చెప్పారు. శ్రీనాథ సహృదయ సాహితి సంస్థకు చెందిన ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా రెండు దశాబ్దాలుగా పలు ఆసుపత్రుల్లో వైద్య సిబ్బందికి, ప్రజలకు చిన్న పిల్లల గుండె జబ్బులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశం నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతోందని, వైద్య విద్యార్థులు కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో నూతన వైద్య పరికరాలను రూపొందించాలని కోరారు. స్విమ్స్ డీన్ డా. అలోక్ సచన్ మాట్లాడుతూ స్విమ్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సి.టి.సర్జరీ విభాగం ఆధ్వర్యంలో పసిపిల్లల గుండె జబ్బులపై అవగాహన కలిగించేందుకు చక్కటి పోస్టర్ ప్రదర్శన ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. స్విమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డా. రాజశేఖర్ మాట్లాడుతూ ఎకో కార్డియోగ్రఫీ ఆవిష్కరణ తరువాత పుట్టుకతో వచ్చే గుండె జబ్బులను గుర్తించడం సులువైందన్నారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రాధ, ఎస్.వి.మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రవి ప్రభు, స్విమ్స్ ఆర్ఎంఓ డా. కోటిరెడ్డి, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.మాధవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సుధారాణి, ఎం.ఆర్.ఓ. శిరీషా, ఎం.ఎస్.డబ్ల్యూ ప్రసాద్, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిద్రావస్థలో ఇరిగేషన్, మైనింగ్ అధికారులు

శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పరివాహక ప్రాంతంలో జీవనది పవిత్ర స్వర్ణముఖి నదిని ఇసుకాసురులు తోడేస్తున్నారు. చంద్రగిరి నుంచి నాయుడుపేట వరకు నదిని ఇష్టమొచ్చినట్లు తోడుకుంటున్నారు. ముఖ్యంగా శ్మశానాలను కూడా వదలి పెట్టడం లేదు. శ్రీకాళహస్తిలోని బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్మశానం కొత్తగా శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని వాటర్ వర్క్స్ కాలనీ వద్ద శ్మశానాన్ని తవ్వేస్తున్నారు. శ్మశానమైతే మాకేంటి? అన్నట్లు వ్యవహారిస్తున్నారు. నదులను రక్షించాల్సిన రెవెన్యూశాఖకు ఇది మా సమస్య కాదని తప్పించుకుంటున్నారు. ఎవరికి వారు ఇసుకను కాపాడే బాధ్యత మాది కాదని తప్పించుకుంటున్నారు.దాంతో స్వర్ణముఖి నదిలో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతుంది. అక్రమ రవాణా దారులెవరో? ఇళ్ళు నిర్మించుకుంటున్న వారు ఎవరో అధికారులకు తెలియనిది కాదు.అయినా చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ రాజకీయ పార్టీ మద్దతు దారులు నిర్వహించే వ్యాపారాల్లో ఇసుక అక్రమ రవాణా ఒకటి. రాత్రికి రాత్రి నది ఖాళీ అవుతుంది. జీవనది రోజు రోజుకు బక్క చిక్కిపోతుంది. ఈ నేపథ్యంలో నదిలో అక్కడక్కడ గోతులుగా మారి వర్షాకాలం అమాయకులను బలి తీసుకుంటుంది.అయినా అధికారుల్లో చలనం లేదు.కారణం ఈ ఇసుక వ్యాపారం చేసే వారికి ఏదో ఒక రాజకీయ పార్టీ అండదండలుండటంతో అధికారులు మనకెందుకులే అని మౌనం వహిస్తున్నారు.గతంలో నది చూసిన వారు నేడు చూస్తే ఇది నదా? లేక చెరువా? అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## వాటర్‌హౌస్ శ్మశానంలో...
# ఇసుకను తోడేస్తున్నారు



శ్మశానం పక్కన నుంచి ఇసుకను తోడేస్తున్న దృశ్యం

**శ్మశానాన్ని వదలల్లేదు:**

శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమం పక్కన నుంచి నది నుంచి చుక్కల నిడిగల్లు,బూరగమాను కండ్రిగకు వెళ్ళు దారి ఉంది.ఈ సమీపంలోని మున్సిపల్ వాటర్ వర్క్స్ ఉంది. గతంలో ఈ నది నుంచే శ్రీకాళహస్తి పట్టణానికి మంచినీరు సరఫరా చేసే వారు.కానీ నేడుపరిస్థితి అక్కడ బావుల పక్కన ఇసుకను తోడి తోడి చివరకు భూగర్భజలాలుఅ దుగింటి పోయాయి.ఈ సమీపంలోనేశ్మశానం ఉంది. ఇక్కడ వాటర్‌హౌస్ కాలనీ, తుఫాన్ సెంటర్,నిర్మిత కేంద్రం,గొడ్డెరు ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యి కుటుంబాలకు సంబంధించిన శ్మశానం ఇది. ఇక్కడ నదిలో నీరు నిల్వ ఉండటంతో అక్కడ ఇసుక సేకరించటానికి వీల్లేదు.దాంతో రోడ్డుపక్కనే ఉన్న శ్మశానం నుంచి ట్రైర్ బండ్లు విచ్చల విడిగా ఇసుకను తోడేస్తూ శవాలు బయట పడుతున్నా పక్కన తోసేసి ఇసుకను బండ్లకు నింపుకుంటున్నారు.మున్సిపల్ బావుల పక్కన ఇసుకను తోడేస్తుంటే ఆ శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే రాబోవు రోజుల్లో నీటి కొరతకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

## ఛలో ఢిల్లీకి తరలిన ఎంఆర్‌పిఎస్ నేతలు



**కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త:** సుప్రీ ంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఈనెల 17న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే నిరసన కార్యక్ర మంకు కుప్పం నుంచి ఎంఆర్‌పిఎస్‌నేతలు శుక్రవారం ఢిల్లీ బయలు దేరారు. జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు ప్రకాష్ నేతృత్వంలో నేతలు వెంకటేష్, గోవింద, జయప్ప, బాబు, లక్ష్మణ్, మునివెంకటప్ప తదితరులు కుప్పం నుంచి రైలులో ఢిల్లీకి బయల్దేరారు.

## రైతులు ఇ-పంట నమోదుచేసుకోవాలి : ఎఎంసి ఛైర్మన్



**రామకుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త:** రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఇ – పంట ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు కోరారు. శుక్రవారం రామకుప్పం రైతు సేవా కేంద్రంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతుల పంటలకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో గిటు ్టబాటు ధరలు కల్పించేలా చర్యలు చేపట్టామన్నారు. రైతుల పంటల వివరాలను ఆర్‌ఎస్‌కె ఇన్‌చార్జ్‌లు రైతుల వద్దకు వెళ్లి పంటల నమోదు తప ్పక చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

**రామకుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త :** కుష్టు వ్యాధి నిర్మూలనపై విజలాపురంలో అవగాహన ర్యాలీని వైద్యాధికారి పూజిత అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, నొప్పి అనిపించని పుళ్ళ, కండరాల్లో బలహీనత వంటి లక్షణాలు ఉంటే పిహెచ్‌సిలో సంప్రదిం చాలన్నారు. హెచ్ఎ బాలు, ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి



**శాంతిపురం, నవంబర్ 14 ప్రభాతవార్త:** ప్రజలు గ్రామాల్లో సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఎంపిడిఓ పిఆర్ కుమార్ కోరారు. కడపల్లి గ్రామంలో ఇంటిపన్ను వసూలు ఆయన పాల్గొన్నారు. మండలంలో 12420ఇళ్లకు సంబంధించి 66.10లక్షల ఇంటి పన్ను ప్రజలు చెల్లించాల్సి ఉందన్నారు. నోటీసులు పొందిన వారు ఆన్‌లైన్ బార్‌కోడ్ విధానంలో చెల్లింపులు చేయాలని కోరారు.

## పరమహంస యోగానందలో బాలల దినోత్సవం



**శాంతిపురం, నవంబర్ 14 ప్రభాతవార్త:** స్థానిక పరమ హంస యోగానంద గురుకులంలో బాలల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ కార్యక్రమాలతో అలరించారు. అనంతరం గెలిచిన విద్యార్థు లకు ప్రిని ్సపాల్ ఆజాద్ హుసేన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత వైద్య సేవలు



**రొంపిచెర్ల, నవంబర్ 14 ప్రభాతవార్త:** పశువులకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు రొంపిచెర్ల మండల పశువైద్యాధికారిని డాక్టర్ ఉష తెలిపారు. రొంపిచెర్ల మండలంలోని బండకింద పల్లి గ్రామ పంచాయతీ, మట్లోళ్లపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 122 పశువులకు పిడుదుల మందు పిచికారి చేశామన్నారు. 36 దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేసి, 17 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయడం జరిగిందన్నారు. పశువైద్యాధికారులు డాక్టర్ ఉష, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ తబ్రెజ్ బాషా, డాక్టర్ చందన ప్రియ, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**రొంపిచెర్ల, నవంబర్14 ప్రభాతవార్త:** మదనపల్లిలో ఈ నెల 16న జరిగే మాల మహానాడు రాష్ట్ర మహాస భలను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ కోరారు. రొంపిచెర్ల మండలంలోని, బొమ్మయ్య గారి పల్లి పంచాయతీ, గుట్టకింద హరిజన వాడలో కరపత్రాలను ఆవిష్కరించి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా, మదనపల్లి సీఎస్ఐ, జెసీఎం హాలు లో జరిగే రాష్ట్ర మహా సభలను పెద్ద ఎత్తున మాలలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, డిబియస్‌యఫ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్, నాగరాజు, ముత్యాలు, దొరస్వామి, శ్రీనివాసులు, గీతా, క్రిష్ణమ్మ, రెడ్డమ్మ, నరసింహులు, బాలు, మనోజ్, రెడ్డప్ప, వెంకటరమణ నడిపన్న, గంగులయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## హాకింగ్స్ స్కూల్‌లో అలరించిన ఫుడ్ ఫెస్టివల్



**కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త:** స్థానిక హాకింగ్స్ స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్స వం సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటలను ప్రదర్శించారు. స్కూల్ ఛైర్మన్ హఫీజ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించుటకే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ షబ్బీర్, ఆర్ఆర్ హాస్పిటల్ ఛైర్మన్ సురేష్ మునిరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీహార్ విజయంతో బిజెపి శ్రేణుల ఆనందోత్సవాలు



**పుంగనూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:** బీహార్ ఎలక్షన్స్ లో భారతీయ జనతా పార్టీ అత్యధిక విజయం సాధించిన ఎన్‌డిఏ కూటమి విజయం పై భారతీయ జనతా పార్టీ శుక్రవారం రాత్రి వేడుకలు నిర్వహించుకున్నారు. ఎన్డీఏ విజయం సాధించడంతో తపాకాయలు వేసి ఆనందోత్స వాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు మాధవరెడ్డి ఫైవ్ మెన్ కమిటీ సభ్యుడు సి.వి.రెడ్డి జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ చైతన్య రాయల్ జనసేన పట్టణ అధ్యక్షుడు నరేష్ రాయల్ సింగల్ విండో చైర్మన్ పగడాల రమణ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మల్లికా రాణి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పెద్దమఠం బాబు చంద్రరాజు టీవీఎస్ మోటార్ ప్రసాద్ అరవపల్లి వెంకటరెడ్డి దిలీప్ నాగరాజు రమేష్ రాజారెడ్డి జంగాల ఉమామహేష్ అమర్ నారాయణ శివయ్య ఆదినారాయణ నాగరాజా నారాయణ ఆర్మీ చిన్న విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఆసుపత్రిలో 5 గంటలకే సూదులు బంద్

**కల్లూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాయంకాలం 5 గంటలకే సూదులు బంద్ అవుతున్నాయి. 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండవలసి ఉన్న 5 గంటల పైన ఎవరూ లేకపోవడంతో అత్యవసర చికిత్స లకు రోగులు ప్రైవేటు ఆసుపత్రికి ఆశ్రయించాల్సి న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా వైద్య అధికారులు స్పందించి సాయం కాలం 5గంటల నుంచి సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



## ఫిర్యాదిదారుడుకి రక్షణ కల్పించాలంటున్న జనసేన

**తిరుపతి,నవంబర్ 14ప్రభాతవార్త:** ఏడుకొండలస్వామి కానుకల లెక్కించే పరకామణినుండి విదేశీడాలర్లు చోరీ కేసులో కీలకఫిర్యాదిదారుడు,మాజీ ఏవిఎస్ఓవై.సతీశ్‌కుమార్‌మృతివెనుక కుట్రదాగిఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఎవరూ ఊహించని రీతిలో ఈ కేసులో ఆయన మృతి అనుమానాలకు తావిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుమల పరకామణి నిందితుడు రవికుమార్‌కు ప్రాణహాని ఉందని, వెంటనే అతన్ని కస్టడీలోకి తీసుకోవాలని జనసేననేత కిరణ్‌రాయల్ సూచించారు. గతంలో ఫిర్యాదిదారుడుని పలువురు బెదిరించారని తెలిపారు.

## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే బొజ్జల



**తిరుమల,నవంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని స్వామివారిని ప్రార్ధించినట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుదీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే దంపతులుఆలయంలోనికి చేరుకుని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలి



**తిరుమల,నవంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేస్తున్నారని, భక్తులకు మంచి సదుపాయాలు కల్పించేలా చూడాల ని టిటిడిఛైర్మన్ బిఆర్‌నాయుడు సూచించారు. ఆలయ అభివృ ద్ధికోసం కృషి చేయాలని హితవుచేశారు. టిటిడి నుండి సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్‌మహేశ్‌యాదవ్,సభ్యులు ,ఈఓ జయకుమార్,అర్చకులు కలసి శుక్రవారం ఉద యం తిరుమలలో ఛైర్మన్ బిఆర్‌నా యుడును మర్యాదపూర్వకంగా కలిశారు. గంగమ్మ ఆశీర్వాదం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. భక్తులకు మంచి సదుపాయాలు కల్పించేందుకు టిటిడి సహకారం అందిస్తుందని తెలిపారు.



## ఘనంగా బాలల దినోత్సవం

**సదం,నవంబర్ 14 ప్రభాతవార్త:** సదంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ఈనెల 26 భారత రాజ్యాంగ దినోత్స వం పురస్కరించుకొని అందజేయనున్నట్లు ప్రధానో పాధ్యాయుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిలు నౌషాద్ ఆలీ,భాస్కర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం



**చౌడేపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలలదినోత్స వాన్ని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైయివేటు పాఠశాలల్లో ఆయన చిత్రపటాన్ని వుంచి నివాళులర్పించారు. చౌడేపల్లి, చారాల, మేకలచిన్నేపల్లి, పుదిపట్ల తదితర ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో, విజయవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బాలల దినోత్స వం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.

## పుస్తక పఠనంతోనే బంగారు భవిత



**చౌడేపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త:** పుస్తక పఠనం తోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు వుంటుందని ఎంఇఓ తిరుమలమ్మలు అన్నారు. స్థానిక గ్రంధాల యం వద్ద బాలల దినోత్స వంతోపాటు గ్రంధాలయ 58వ జాతీయ వారోత్స వాల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంధాలయాల పాత్ర, పుస్తక పఠనం వల్ల కల్గే లాభాలు, మొబైల్ ఫోన్‌ల వల్ల కల్గే అనర్థాలను గుర్తించి పిల్లలకు వివరించారు. ఉపాధ్యాయురాలు పరిమళ, విశ్రాంత ఉపాధ్యాయులు రామసుబ్బయ్య, కృష్ణారెడ్డి, గ్రంధాలయాధికారి సోమశేఖర్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## లలితార్థ వ్యాఖ్యాన లహరి సౌందర్యలహరి



**చౌడేపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త:** పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి చెంత నిర్వహించబడ్డ సౌందర్యలహరి భక్తులకు వీనులవిందును కల్పించబడింది. కార్తీక శుద్ద దశమిని పురష్కరించుకొని ఉదయాన్నే భక్తులచే 108కళశాలతో అభిషేకం, విశేషాలంకరణ జరిగింది. సుధాస్వామి గురువు శిష్యురాలు లక్ష్మీసరస్వతీ (హైదరాబాదు)వారి ఆధ్వర్యంలో మహిళా భక్తులు సౌందర్యలహరి, ఖడ్గమాల, రుద్రం పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానార్చకురాలు శ్రావణి, ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి లచే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మాంథత శంకర్‌నారాయణ విశిష్ట అతిథిగా విచ్చేశారు. అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వేచియుండు గది





**పూతలపట్టు, నవంబర్ 14 ప్రభాతవార :** సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వేచియుండు గది సబ్ రిజిస్టర్ రహమతుల్లా ప్రారంభించారు. శుక్రవారం సబ్ రిజిస్టర్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మించిన అమర్ రాజా రాజన్న ఫౌండేషన్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో 12 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు అభివృద్ధి రంగంలో రాజన్న ఫౌండేషన్ అందించడం విశిష్టతమైన సేవలు నిబంధనతకు నిదర్శనం అన్నారు. సమాజ సేవలో అమర్ రాజా గ్రూప్ పాకల సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణంలో వృద్ధులు చంటి పిల్లలు తల్లులు వికలాంగులు వేచి ఉండటం అమర్ రాజా సంస్థ 12 లక్ష రూపాయలు ఖర్చు చేసి విశా లమైన సౌకర్యంతమైనగదినినిర్మించడం గొప్ప విషయమని పాకాల సబ్ రిజిస్టర్ సంతోషం వ్యక్తం చేశారు.

## నూతన గృహప్రవేశంలో పెద్దిరెడ్డి



**కల్లూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:** పులిచర్ల మండలంలోని కావేటిగారిపల్లి పంచాయితీలో మల్లిరెడ్డిగారిపల్లె నందు టి.రామ్మూర్తిరెడ్డి గృహ ప్రవేశాన్ని పుంగనూరు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సురేంద్రనాథ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాధముని రెడ్డి, తడకర జయచంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చక్రవర్తిరెడ్డి, విక్రమ్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, మునికృష్ణ, మునిరామయ్య, రామమూర్తి, హేమసుందర్‌రెడ్డి, రుపేష్, కేశవులరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పాలనలోనే పదోన్నతులు

– పులిచెర్ల సింగల్ విండో అధ్యక్షుడు లెక్కల ధనంజయ నాయుడు



**కల్లూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన లోనే ఉద్యోగస్తులకు పదోన్నతులు, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయని పులిచెర్ల సింగల్ విండో అధ్యక్షుడు లెక్కల ధనంజయ నాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సదుం, పులిచెర్ల, రొంపిచర్ల మండలాలలోని 37 మంది మినీ అంగన్వాడి కార్యకర్తలు మెయిన్ అంగనవాడి కార్య కర్తలుగా పదోన్నతి పొందడంతో వారికి పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాణి, సిడిపిఓ వాణి శ్రీదేవి, సూపర్వైజర్లు విజయలక్ష్మి, మల్లీశ్వరి శిరీష, ఉప సర్పంచ్ ప్రభాకర్, నాయ కులు పలుకూరి ధనుంజయ నాయుడు, మహేష్, గోపి, త్యాగరాజు, నూర్‌భాషా, అష్రఫ్, పాల్గొన్నారు.

## కుప్పంలో మోడల్ గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు



**కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలో మోడల్ గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాలను ఆయన స్థానిక గ్రంథాలయంలో ప్రారంభించారు. గ్రంథాలయాలు విజ్ఞానభాండారాలు అని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన గ్రంథాలయం కోసం స్థల పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలు సమాజానికి ఎంతో ముఖ ్యమన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సి పల్ ఛైర్మన్ సెల్వరాజ్,క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కౌన్సిలర్ జిమ్‌దాము, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, గుడుపల్లె అధ్యక్షుడు సుబ్బు, గ్రంథాలయ అధికారిణి సత్యవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మారెమ్మ ఆలయ కుంబాభిషేకం



**కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త:** మండలంలోని గుడ్లనాయనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మారెమ్మ ఆలయ కుంబాభిషేకాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వినాయక స్వామి, శ్రీ మారెమ్మ, నవగ్రహ విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్టించారు. అమ్మవారికి ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పట్టువస్త్రాలు, ఆలయానికి గుడిగంటను అందజేశారు. కార్యక్రమాల్లో రెస్కో ఛైర్మన్ ప్రతాప్, నేతలు మహేంద్ర, వేడి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నేతలపై హత్యాయత్నం కేసు కొట్టివేత



**కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త:** రామకుప్పం మండలం కొల్లుపల్లిలో 2022లో జరిగిన సంఘటనల్లో అప్పట్లో కుప్పం నియోజకవర్గంకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నేతలపై నమోదైన హత్యాయత్నం కేసును చిత్తూరు జిల్లా కోర్టులో న్యాయమూర్తి కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. దీంతో తెదేపా శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తొలుత కుప్పం కోర్టు, ఆపై చిత్తూరు జిల్లా కోర్టులో ఈ కేసుకు సంబంధించి వాదనలు జరిగాయి. శుక్రవారం న్యాయమూర్తి కేసు కొట్టివేశారు. దీంతో పార్టీ శ్రేణులు రాష్ట్ర తెదేపా లీగల్ సెల్ న్యాయవాదులు, చిత్తూరు, కుప్పం న్యాయవాదులు చంద్రశేఖర్, అమరనాథ్‌లను సత్కరించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వేడుకగా బృందావన్‌లో బాలల దినోత్సవం



**చిత్తూరురూరల్, నవంబరు 14 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, సంతపేటలోని బృందావన్ సీనియర్ సెకం డరీ పాఠశాల నందు వ్యవస్థాపకులు శైలజకుమారి ఆద్వర్యంలో బాలల దినోత్స వంను ఘనంగా నిర్వహించారు. పిల్లలు వివిధ మొక్కల వేషదారణలో మొక్కల పెంపకం యొక్క ఆవశ్యకతను తెలుపుతూ చక్కని నృత్యాలు, పాటలతో అలరించారు. అనంతరం పాఠశాలనుంచి గాంధీ విగ్రహం కూడలి వరకు మొక్కల పెంపకం గురించి ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కలిగించారు. అలాగే చక్కని వేషధారణలతో హాజరైన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులను అందజేసారు. పాఠశాల అధ్యాపకబృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ



**చిత్తూరురూరల్, నవంబరు 14 ప్రభాతవార్త:** చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ కార్యాల యం ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి వినతులను మున్సి పల్ డిఈ రమణ, హౌసింగ్ డిఈ శ్రీధర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ త్యాగరాజులు స్వీకరించారు. ప్రజలు అందించిన అర్జీలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే అర్జీలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏ కుమారస్వామియాదవ్, తెదేపా నగర అధ్యక్షుడు నరేష్, నాయకులు సుబ్బి, గోపాలక్రిష్ణ, లీలావతి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీహార్‌లో ఎన్డీఏ కూటమి గెలుపుపై సంబరాలు



**చిత్తూరురూరల్, నవంబరు 14 ప్రభాతవార్త:** దేశంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా భావిస్తున్న యుపిఏ కూటమి పార్టీలకు బీహార్ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు లాంటిదని, డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని భావించిన బీహార్ ప్రజలు ఎన్డీఏ కూటమికి పట్టం కట్టారని భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు తెలిపారు. శుక్రవారం గాంధీ విగ్రహం ఎదుట బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపు సాధించడంతో భాజపా నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మోహన్‌నాయుడు, రాష్ట్రనాయకులు డాక్టర్ బాబు, సంతపేట మండల అధ్యక్షుడు రామభద్ర, సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం, నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సత్య తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకం తలెత్తుకునేలా చేస్తుంది: పగడాల రమణ



**పుంగనూరు,నవంబర్ 14 ప్రభాతవార్త:** నేటి సమాజంలో యువ విద్యార్థి తరాల వారు తప్పనిసరిగా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సింగల్ విండో డైరెక్టర్ పగడాల రమణ హితవు పలికారు. గ్రంథాలయ వారోత్స వాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుస్తకం వద్ద మనం తలదించిన ఆ పుస్తకం మనల్ని ప్రపంచంలో తలెత్తుకునేలా చేస్తుందని, వేద కాలం నుంచి నిరూపించబడిన వాస్తవమన్నారు. ఏఎస్ఐ అశ్వర్థ నారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి తులసి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తోటగిరి, కె వి రమణ తోపాటు పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు

## సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం



**కాణిపాకం, నవంబర్ 14 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో అమల వుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు భక్తులు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు తిరుపతికి చ చెందిన వెంకట్ కుమార్ అనే భక్తుడు ఈపథకానికి 1,01.116 విరాళంగా ఆలయ ఏఈఓలు రవీంద్రబాబాబు, దనపాల్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలనుఅందజేశారు. టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, దాత కుటుం బసభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో డిప్యూటీ సీఎం ఓఎస్డీ



**కాణిపాకం, నవంబర్ 14 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఓఎస్డీ మధుసూధన్ కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తది తరులు పాల్గొన్నారు.

## కందూరు గ్రామసభ



**సోమల,నవంబర్ 14 ప్రభాతవార్త:** కందూరు గ్రామ పంచాయతీ మిట్టపల్లి రెవెన్యూ గ్రామం నందు స్వామిత్వ గ్రామసభ నిర్వహించడం జరిగినది. ప్రజలు స్వామిత్వ సర్వేలో గృహాలు,గృహాల మధ్య ఉన్న స్థలాలు కొలతలలో ఏమైనా ఆబ్జెక్షన్స్ ఉన్నచో తెలియజేయవచ్చు అని తెలపడం జరిగినది లో పంచాయతీ సెక్రటరీ, సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

## కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



**సోమల, నవంబర్ 14 ప్రభాతవార్త:** కుష్టు వ్యాధిని గుర్తించి దానిని పూర్తిగా రూపుమాపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దపల్లి ప్రాథమిక వైద్యాధికారి బాలాజీ అన్నారు. పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఈనెల 17 నుంచి 30 వరకు చేపట్టే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో చేపట్టాల్సి న విషయాల గూర్చి ఆరోగ్య విస్తరణాధికారి ఉదయభాస్కర్ ఏఎన్ఎం లకు ఆశ వర్కర్లకు, వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రమ్మ హెల్త్ అసిస్టెంట్ సురేంద్ర ఏఎన్ఎంలు హేమ శారద , మాబుజాన్, శారద తదితరులు పాల్గొన్నారు

## అమర్‌రాజా సంస్థలకు 13 బంగారు పతకాలు



**రేణిగుంట నవంబర్ 14 ప్రభాతవార్త :** రేణిగుంట మండలం కరకంబాడి అమర రాజా గ్రూప్ లిమిటెడ్ కంపెనీలకు తైవాన్ లో తైపీ నగర్ నందు అంతరాతీయ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ కన్వెన్షన్ 50వ వార్షికోత్సవం సందర్భంగా 13 పతకాలను అందజేశారు. 14 దేశాల నుండి దాదాపు 884 కంపెనీల ప్రతినిధి బృందాలు పాల్గొనగా అందులో అమర రాజాకు చెందిన 13 బృందాలను ఎంపిక చేసి వారికి బంగారు అవార్డులను అందజేశారు. అమర్ రాజా కంపెనీ లిమిటెడ్ సంస్థలు సాధించిన ఘనవిజయంపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని, చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ నరసింహులు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అవార్డు గెలుచుకున్న బృందాలను అమర రాజా చైర్మన్ గల్లా జయదేవ్ అభినందించారు.

## అట్టహాసంగా ముగిసిన ప్రీమియర్ లీగ్ -2025




**తిరుపతి విద్యనవంబర్ 14 ప్రభాతవార్త:** తిరుపతి నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నారాయణ ప్రీమియర్ లీగ్–2025 శుక్రవారం ఘనంగా ముగిశాయి. శ్రీనివాసమంగాపురంలోని నారాయణ ఉన్నత బాలుర పాఠశాలలో జరిగిన ముగింపు వేడుకలో విద్యార్థులు తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు విచ్చేసి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, శారీరక,మానసిక దృఢత్వానికి దోహదపడతాయి అని, నారాయణ విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం అన్నారు. అనంతరం విజేత విద్యార్థులకు ట్రోఫీలు,మెడల్స్ అందచేశారు. కార్యక్రమం ముగింపు వేడుకలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు,బాణాసంచా వెలుగులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్స్ వేణుగోపాల్, చక్రవర్తి, సురేష్,స్కూల్ ఏజీఎం శ్రీనివాసులు,ప్రిన్సి పల్స్, ఎ జి ఎం లు, అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది,పెద్ద సంఖ్యలో విద్యార్థులు దాదాపు ఐదు వేలమంది కి పైగా పాల్గొన్నారు.



## భవనాలను క్రమబద్ధీకరించుకోండి: కమిషనర్

**శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా, అనుమతి పొంది ప్లానుకు భిన్నంగా నిర్మించుకున్న భవనాలను బిల్డింగ్ పీనలైజేషన్ పథకంలో క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1985 జనవరి 1 తరువాత 2025 ఆగస్టు 31కి ముందు నిర్మించుకున్న భవనాల బిపిఎస్ ద్వారా క్రమబద్ధీకరిం చుకొనుటకు ప్రభుత్వం జిఓఎంఎస్ నెంబర్ 225,తేది 12.11.2025 జారి చేసారన్నారు. ఈ ఉత్తర్వులు జారి అయిన 120 రోజుల్లో ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన వివరించారు.

## సెయింట్ జేవియర్స్ పాఠశాలలో సంబరాలు

**తొట్టంబేడు,నవంబర్ 14 ప్రభాతవార్త:** సెయింట్ జేవియర్స్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో చాచానెహ్రూ 137 జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షర్లి బాల బాలికలకు చాచా నెహ్రూకు సంబందించి వివరించారు.పాఠశాలలో ప్రతిభా అవార్డును సాధించిన చక్రవర్ధన్‌లకు ఫాదర్ కిర్నితం చేతుల మీదుగా అవార్డులను అందించి సత్కరించారు.సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



## చాచా ఆశయ సాధనకు కృషి చేయాలి: బేబీరాణి

**శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త** ఈ నాటి బాలలే రేపటి భావి భారత పౌరులన్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కలలను సాకారం చేయటానికి ప్రతి చిన్నారి కృషి చేయాలని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాబూ అగ్రహారం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో చాచా నెహ్రూ 137 జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా జడ్జి బేబీరాణితో పాటు ఎంఇఓ బాలయ్య,న్యాయవాదులు అధ్యాపకులు,విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆమె బాలల దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు.





## గ్రంధాలయంలో నెహ్రూ జయంతి

**తొట్టంబేడు,నవంబర్ 14 ప్రభాతవార్త :** తొట్టంబేడు శాఖ గ్రంధాలయంలో శుక్రవారం చాచానెహ్రూ 137 జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ చాచా నెహ్రూ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అలాగే 58 జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్బంగా గ్రంధాలయాధికారి హరికృష్ణా సారధ్యంలో కార్యక్రమూలను ఏర్పాటు చేసారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బాలికల హాస్టల్ వార్డెన్ జయసుధ, రీడర్స్ క్లబ్ సభ్యులు కృష్ణమనాయుడు, దుష్యంత్‌బాబు, అనందయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సేవలకు ప్రాధాన్యత



**తొట్టంబేడు,నవంబర్ 14 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధికంగా వ్యవసాయయోగ్యమైన ట్రాక్టర్లను విక్రయించినందుకు గాను శుక్రవారంఎంజిఎం ఆసుపత్రి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన షోరూంలో సంబరాలు జరిపారు. కంఫర్ట్ న్యూ హలండ్ ట్రాక్టర్ షోరూం తరఫున అత్యధిక ట్రాక్టర్లు అమ్ముడుపోయిన సందర్బంగా భారత దేశ హెడ్ అన్‌సుమన్ పాండే ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కెల్లా శ్రీకాళహస్తిలో టిం అత్యధిక ట్రాక్టర్లను విక్రయించినట్లు వివరించారు. హాలండ్ ట్రాక్టర్లు ధర తక్కువని మన్నిక ఎక్కువని వివరించారు.ఈ సందర్బంగా షోరూం మేనేజర్ సుధాకర్ యాదవ్‌ను హెడ్ సుమన్ పాండే ప్రత్యేకంగా అభినందించారు.

## గుడిమల్లం అలయాన్ని సందర్శించిన పీఠాధిపతి

**శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 14 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో శుక్రవారం పాండిచ్చేరి పీఠాధిపతులు వారి సహచరులు దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఆలయ ఇఓ రామచంద్రారెడ్డిలు స్వాగతం పలికారు. పాండిచ్చేరి శివాలయానికి చెందిన గణేష్ స్వామి, తిరుమంగళం ఈశ్వర్, తుంగగోవింద స్వామిలు రాగా వారికి స్వామి అమ్మవార్ల దర్శనంతో పాటు ఆలయ మర్యాదలతో ప్రసాదాలు అందించారు.

## రాజుల కండ్రిగ పాఠశాలలో బాలల దినోత్సవం

**శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 14 ప్రభాతవార్త :** ఏర్పేడు మండలం మడిబాక పంచాయతీలోని రాజుల కండ్రిగ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా నెహ్రూ గురించి ఆయన దేశానికి అందించిన సేవల గురించి కడివేటి సాంబశిరాజు విద్యాకమిటి చైర్మెన్ మంజుల,ఉపాధ్యాయులు అరుణకుమారి తేజా, సుభాషిణి తదితరులు ప్రసంగించారు.





## ఘనంగా బాలల దినోత్సవం

**పుత్తూరు రూరల్, నవంబరు 14 ప్రభాతవార్త:** పరమేశ్వర మంగళం ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్బంగా పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ దోహదపడుతున్న దాత కొరపాటి మధురం ఎంతో మధురమైన మనసుతో పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం 28 వేల ఖర్చుతో ఎన్నో పోషకాలతో కూడిన చక్కటి విందు భోజనం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌శెట్టి, కొరపాటి మధురం, ఆర్‌డీటీ అధికారులు,ఉపాధ్యాయులు ఎస్.గీత, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తమిళనాడు స్వామి శ్రీకాళహస్తిలో పూజలు

**శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త:** తమిళనాడులోని పాండిచ్చేరికి సమీపంలోని తిరుమంగళం చిదంబరేశ్వర ఆలయానికి చెందిన ఆదినా శ్రీ గణేష్‌స్వామి వాయులింగేశ్వరుని సేవకు వచ్చారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారు సమీపంలోని అంబలి స్వామి ఆశ్రమంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయంలో సాధువులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేసారు.ఈ సందర్బంగా అక్కడ మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి పూజలు జరిపారు.ఆశీర్వాచనాలు అందుకున్నారు. ఈ కార్యక్రమాల్లో శ్రీనివాసులుతో పాటు అంబలి స్వామి, జీవ తదితరులు పాల్గొన్నారు.



## రేణిగుంట మండల సర్వసభ సమావేశం

**రేణిగుంట నవంబర్ 14 ప్రభాతవార్త :** ఎంపీడీవో కార్యాలయం సమావేశ భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ హరిప్రసాద్ అధ్యక్షత వహించగా ఎంపీడీవో రవిచంద్ర నిర్వహించారు. సమావేశంలో సభ్యులు అనేక విషయాలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ హరిప్రసాద్, ఎంపీడీవో రవిచంద్ర సమస్యలను సావధానంగా విని వివిధ శాఖల అధికారుల ద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, రేణిగుంట సర్పంచ్ నాగేశం, విప్పమానుపట్టడ సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు, మండల పరిధిలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రాస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు

**రేణిగుంట నవంబర్ 14 ప్రభాతవార్త :** రేణిగుంట మండలం కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాస్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మిషన్ కోఆర్డినేటర్ కృష్ణ మంజరి, డిసిపిఓ శివశంకర్, రాస్ కోఆర్డినేటర్ భారతి, శైలజ, పాఠశాల బోధన బోధన సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.విద్యార్థులతో స్కూల్ బోర్డుపై చాచా నెహ్రూ రూపాన్ని చిత్రీకరింపజేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు పెంచల తో పాటు మిఠాయిలు పండ్లు పంపిణీ చేశారు.

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభినందనీయం

**రేణిగుంట నవంబర్ 14 ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమ కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం అభినందనీయమని ఆర్టిసి స్త్రీ శక్తి పథకానికి 400 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వాన్ని ఆర్టిసి బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ పొగడ్తలతో ముంచెత్తారు. ఆగస్టు నెల నుండి అక్టోబర్ నెల వరకు ఆర్టీసీ కి రావలసిన హీరో పేరు టికెట్ల మొత్తం 400 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ప్రత్యేక శ్రద్ధ చూపిన రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణ బాబు, ఆర్టీసీ ఎండి ద్వారక తిరుమలరావు, ఆర్టీసీ చైర్మెన్ కొనకళ్ళ నారాయణ లకు ధన్యవాదాలు తెలిపారు.



## టిడిపి కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం



**తిరుపతిరూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం టిడిపి కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్‌స్థాయి కమిటీలకు నియమితులైన సభ్యులచే ప్రమాణం చేయించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనని, యువతే ఈ పార్టీకి మూలస్తంభం అన్నారు. గత వైసిపి పాలనలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తమ్ముడు రఘునాధరెడ్డి చేసిన, అరాచకాలు, దౌర్జన్యాలు ప్రజలకు తెలిసిన విషయమేనని గుర్తు చేసారు. తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై నమ్మకం పెట్టుకుని, సామాన్య కార్యకర్త స్థాయి నుండి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదగడం జరిగిందని, పార్టీ సిద్ధాంతాలకు లోబడి పని చేసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడినవారికి పార్టీలో సముచ్చిత స్థానం అధినాయకత్వం కల్పిస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కార్యకర్తలు చెప్పిన వ్యక్తులనే స్థానిక ప్రజాప్రతినిధులుగా ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షుడు సి.ఆర్,రాజన్, తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వర‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం

**తిరుపతిరూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త:** విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అవసరమని శ్రీసాయి సుధా ఇంగ్లీషు మీడియం అధినేత డాక్టర్ సుధారాణి అన్నారు. శుక్రవారం నెహ్రు జయంతిని పురస్కరించుకుని శ్రీసాయి సుధా ఇంగ్లీషు మీడియం స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. పిల్లలకు బాలల దినోత్సవ విశిష్టతను తెలియజేసారు. అనంతరం పిల్లలకు చాక్లెట్స్, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటకృష్ణ, మేనేజర్ పుష్ప, ఉపాధ్యాయులు శారద, రాధ, రేవతి, ఆశీఫా, భార్గవి, ఛాయా కుమారి, లక్ష్మీ, భువనేశ్వరి, హారిక, లక్ష్మీ, రేఖ, శకుంతల, కళ్యాణి, ధనలక్ష్మీ, నారాయణమూర్తి, కిరణ్‌కుమార్, అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.



## తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా ధన

**తిరుపతిరూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధన రాయల్ ప్రమాణస్వీకారం చేసారు. ఎమ్మెల్యే పులివర్తి నానికి అత్యంత విశ్వాసపాత్రుడుగా ఉంటూ పార్టీ బలోపేతానికి ధనరాయల్ కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే నానికి ఎల్లవేళల విశ్వాస పాత్రుడిగానే ఉంటూ పార్టీ నియమాలకు సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానని ధనరాయల్ తెలిపారు. గాంధీపురం టిడిపి ప్రధాన కార్యధర్శిగా కలకడ క్రిష్ణయ్య, సంయుక్త కార్యధర్శిగా పత్తి మునికృష్ణ, అధ్యక్షుడుగా అరుణ్‌కుమార్, మహిళా అధ్యక్షరాలుగా ప్రియదర్శినిలు ప్రమాణస్వీకారం చేసారు.



## వేదాంతపురం టిడిపి అధ్యక్షుడుగా చెలుకుల



**తిరుపతిరూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా చెలుకుల పరంధామ యాదవ్, ఉపాధ్యక్షుడుగా శ్యాం బాబు, ప్రధాన కార్యధర్శి తోట చిరంజీవి ప్రమాణస్వీకారం చేసారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని తిరుపతిరూరల్ మండలంలోని కస్టర్, యూనిట్, గ్రామ, బూత్ స్థాయి కమిటీలకు నియమితులైన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

## గాంధీపురం గ్రామ పంచాయతీని గ్రేటర్‌లో విలీనం చేయం

-పంచాయతీ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యులు ఏకవాక్య తీర్మానం

**తిరుపతిరూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీని గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయడానికి విముఖత చూపారు. శుక్రవారం గాంధీపురం గ్రామ పంచాయతీలో వార్డుసభ్యుల సమావేశం సర్పంచ్ శివలక్ష్మీ ఆధ్వర్యంలో జరిగింది. గ్రేటర్ తిరుపతిలో గాంధీపురం గ్రామ పంచాయతీని విలీనం చేసే తీర్మానాన్ని తిరస్కరించారు. తిరస్కర తీర్మానాన్ని డిపిఓకు అందజేస్తామని తెలిపారు. గ్రేటర్‌లో పంచాయతీని విలీనం చేస్తే లాభం కంటే నష్టం ఎక్కువగా ఉందన్నారు.ఎంపిటిసి జైకర్, పంచాయతీ కార్యధర్శి లతశ్రీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## వాణిజ్యపన్నుల శాఖల అధికారుల బాధ్యతలు స్వీకరణ

**శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలో వాణిజ్యపన్నుల శాఖ(జిఎస్‌టి) కార్యాల యాన్ని శుక్రవారం ప్రారంభించారు.పట్టణంలోని పానగల్ రోడ్డులో గోకులం గ్రాండ్ భవనంలో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసారు.ఇక్కడ పని చేయటానికి డిసిటిఓలను నియమించారు.ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్లుగా గునిశెట్టి మురళీకృష్ణ, లక్ష్మీదేవిలు నియమించగా వారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను రేణిగుంట, తిరుపతి, శ్రీకాళహస్తికి చెందిన జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఘనంగా సత్కరించారు. రేణిగుంటకు చెందిన మురళీకృష్ణ తొలి ప్రయత్నంలోనే గ్రూప్2లో అర్హత సాధించి వాణిజ్యపన్నుల శాఖలో ఎసిటిఓగా కర్నూల్,అనంతపురం ప్రాంతాల్లో పని చేసారు. పదోన్నతిపై డెప్యూటి కమిష నర్‌గా శ్రీకాళహస్తి సర్కిల్‌లో నియమించారు.ఆయన బాధ్యతలు స్వీకరించారు.



## మనల్ని మనం సంస్కరించుకోవాలి! : రేహాన్

**శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త:** నేడు సమాజంలో వారు బాగా లేరు, వీరు బాగా లేరనే వాదనలు వినబడుతున్నాయని, మనల్ని మనం ముందు సంస్కరించుకోవాలని అని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన మాట్లాడుతూ మన సంసారంలో సుఃఖం సంతోషంగా ఉండాలంటే ప్రవక్తలు ఆచరించిన జీవన విధానాన్ని అలవరచుకోవాలని ఆయన సూచించారు. నేడు మనం కుటుంబం నుంచి సమాజం వరకు ఇతరుల మీద నింద తోసేయటం తప్ప మనల్ని మనం సంస్కరించుకోవాలనే ధ్యాస లేదన్నారు. ఇస్లాం మతం ముందు మనల్ని మనం సంస్కరించుకోవాలని సూచిస్తుందన్నారు. ఇక మరో దుర్గుణం నిత్యం మనం ఇతరుల చెడులను గుర్తించటం తప్ప మనలోని తప్పులను మనం తెలుసుకోలేక పోతున్నామన్నారు. మనం సన్మార్గంలో నడవాలంటే మనలోని తప్పులు తెలుసుకొని సరిదిద్దుకోవాల్సి ఉందన్నారు.



## చిలకమాలక్ష్మీని దర్శించుకున్న మాజీ ఎంఎల్ఏ

**తొట్టంబేడు,నవంబర్ 14 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి-చెన్నై మార్గంలో వెలసిన చిలకమాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి భక్తి శ్రద్దలతో పూజలు జరిపారు. కొత్తగా నిర్మించి ఇటీవల కుంబాభిషేకం చేసిన ఆలయంలో పార్వతిదేవి, లక్ష్మీ,సరస్వతి స్వరూపమైన చిలకమాలక్ష్మీ ఆలయంలో మధుసూధనరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు కమిటి సభ్యులు చంద్రశేఖర్‌నాయుడు వారి సహచరులు రఘు నాయుడు, రమణారెడ్డి, లోకేష్‌నాయుడు ఘనస్వాగతం పలికారు. మాజీ ఎంఎల్ఏతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పఠాన్ ఫరీద్‌ఖాన్,సురేష్, బుల్లెట్ శ్యాంఆవుల శ్రీనివాసులు, మణి,బాలాగౌడ్, సుధీర్, ప్రసాద్ పాల్గొన్నారు.



## నాగార్జున్ అభిమానుల సంబరాలు

**శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త:** శివ సినిమా విడుదల సందర్బంగా శుక్రవారం అక్కినేని నాగార్జున అభిమానులు సంబరాలు జరుకున్నారు.ఫ్యాన్స్ అధ్యక్షుడు ఇర్లరాజా సారధ్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అభిమానులకు పంచి పెట్టారు.ఈ కార్యక్రమాల్లో వెంకీ, కోటి, చందు, విజయ్,తిలక్,శశిసాయి, సుబ్బు,మస్తాన్‌బాబు పాల్గొన్నారు.



## ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్‌లో బాలల దినోత్సవం

**శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్ లాల్ 137వ జయంతిని పురస్కరించుకొని సంబరాలను ఏర్పాటు చేసారు. పాఠశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి సారధ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో చిన్నారుల వేష ధారణలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.



# తిరుపతి డివిజన్

## విద్యార్ధినులకు వ్యాసరచన పోటీలు



**చంద్రగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త:** స్థానిక శ్రీపద్మావతీ జిల్లా పరిషత్ బాలికల జడ్పీ హైస్కూల్ నందు శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈఓ-2 భాస్కర్‌బాబు ముఖ్య అతిధిగా విచ్చేసి బాలికలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలలో రాణించిన బాలికలకు ఆయన ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

## గ్రంధాలయ వారోత్సవాలు

**చంద్రగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త:** గ్రంధాలయ వారోత్సవాలలో మొదటి రోజున నవంబర్ 14 దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వార్డు సభ్యుడు కొత్తపాటి కోటిరెడ్డి పతాకావిష్కరణ గావించారు. నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి ఎ.రెడ్డెమ్మ, రాయల్ విక్టరీ స్కూల్ టీచర్ రోహిణి, రిటైర్డ్ టీచర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, లైబ్రరీ సిబ్బంది రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



## బీహార్‌లో ఎన్‌డిఎ అఖండ విజయం



**చంద్రగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త:** బీహార్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం తమ పాలనాపరమైన పనితీరుతో ఎన్‌డిఎ కూటమి అఖండ విజయం సాధించినట్లు బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని తెలిపారు. బీహార్‌లో శుక్రవారం విడుదలైన ఎన్నికల ఫలితాలు దేశంలో నరేంద్రమోడీ పాలనకు గీటురాయిగా నిలిచాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కాకిమాను మునిరాజ్, నాయకులు టి.సుబ్రమణ్యం యాదవ్, జమ్మల లక్ష్మమ్మ, సునీల్‌కుమార్ యాదవ్, శశికుమార్, ఇందుశేఖర్, సంగీతం దొరస్వామి, పుష్పలత, చంద్రకళ, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యను పేదలకు దూరం చేయవద్దు : వైస్ ఎంపిపి

**రామచంద్రాపురం, నవంబర్ 14 ప్రభాతవార్త:** మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి వైద్య విద్యను పేదలకు దూరం చేయవద్దని వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు అన్నారు. శుక్రవారం నెత్తకుప్పం వారపు సంతపులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలసి చేపట్టారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు మెడికల్ కళాశాలలను కట్టబెట్టడానికి రంగం చేస్తుం దన్నారు. ప్రైవేటీకరణ ఆపకపోతే వైసిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలోఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అట్టహాసంగా గ్రంథాలయ వారోత్సవాలు



**నారాయణవనం, నవంబర్ 14 ప్రభాతవార్త :** జాతీయ 58 గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమం మండలకేంద్రంలోని నారాయణవనంలో శుక్రవారం ప్రారంభమైనది.నేటి నుంచి 20వ తేది వరకు జరిగే ఈ వారోత్సవాలు అందరి సహకారంతో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ జనార్ధన్‌రాజు, వీఆర్‌ఓ పళణి, శాఖ గ్రంథాలయ అధికారి జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించండి : సిఎండికి ఎమ్మెల్యే వినతి

**నారాయణవనం, నవంబర్ 14 ప్రభాతవార్త :** సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలం ముడియూరు గ్రామంలో కొత్తగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబందించి టెండర్లు పిలిచి పనులను ప్రారంభించాలని సిఎండి శివశంకర్‌ను తిరుపతి ఆలయన కార్యాలయంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యవేడు మండలం చమర్తికండ్రిగలో చివరి దశ నిర్మాణంలో వున్న విద్యుత్ సబ్‌స్టేషన్ త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని ఏడు మండలంలో రైతులు, ప్రజలకు సంబందించిన విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. వీటిపై సిఎండి సానుకూలంగా స్పందించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అంతకుముందు సిఎండిని దుశ్శాలువతో ఎమ్మెల్యే సత్కరించారు.



## ప్రజా దర్బార్‌కు వెల్లివెరిసన చైతన్యం...



**కేవీబీ పురం, నవంబరు 14 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కేవీబీ పురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజలు నుంచి విశేష స్పందన లభించింది. సత్యవేడు నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజలు భారీ స్థాయిలో వచ్చి సమస్యలను విన్నవించుకున్నారు. స్వయంగా కూరపాటి శంకర్‌రెడ్డి ప్రజల నుంచి వినతులను తీసుకుని వారి సమస్యలను స్వయంగా విన్నారు. మండలంలో పలు సమస్యలతో పాటు రాయలచెరువు బాధితులు వారి సమస్యలను వినతి రూపంలో శంకర్‌రెడ్డికి రాతమూలకంగా ఏదైనా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో 327 ఫిర్యాదులు ప్రజాదర్బార్‌కు అందినట్లు కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

**ప్రధాన సమస్యలు ఇవే...** కవీబీ పురం మండలంలో అధికంగా పక్కా గృహాలు, వితంతు, వృద్ధాప్య పింఛన్లతో వివాహమైన దంపతుల వారికి రేషన్‌కార్డులతో పాటు ఇంటి స్థలం లేని బాధితులు, ఇంటి పట్టాల కొరకు అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు.మండలంలోని రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేసేందుకు ప్రతి రైతుకు గుర్తింపు కార్డులను సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి పంపిణీ చేశారు. కేవీబీ పురం మండలం కాట్రపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఇజ్రాయిల్ అనే యువకుడు గురువారం విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న బాధితుడిని శంకర్‌రెడ్డి పరామర్శించారు.తెలుగుదేశం పార్టీ, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, కేవీబీ పురం, బుచ్చినాయుడు కండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం

**కేవీబీ పురం, నవంబరు 14 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కేవీబీ పురంలో బాలల దినోత్సవ సందర్భంగా కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారికుమార్, జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గౌరీశంకర్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎఫ్ఏ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభకనబరచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు 10వ తరగతిలో 600 మార్కులు వచ్చే విధంగా టార్గెట్ చేసుకోవాలన్నారు. వీరందరికి కూడా డిక్షనరీలను బహుమతిగా ఇవ్వడం జరిగింది. శ్రీకాళహస్తి ఉపాధ్యాయ సంఘం వారిచే ఒక జత దుస్తులను విద్యార్థులకు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు నిత్యావసర సరకులు, విద్యా సామగ్రి పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు సురేష్ తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్లు, ఎంఈవో శివ శంకరయ్య, సీఎంవో సురేష్, ఏఎస్‌వో సారథి, జీసీడీవో పుష్ప, ఏఎల్‌ఎస్‌సీవో మీనాక్షి, ఏపీవో సుధాకర్, ఏపీవో భువనేశ్వరి, ఐటీ సెల్ ధనంజయలు నాయుడు,తెలుగు టీచరు దేవరాజులు, ఎంఈవోలు లక్ష్మిపతి, రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీ నుంచి టీడీపీలోకి

**కేవీబీ పురం,నవంబరు 14 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీ పార్టీలోకి చేరారు. వైసీపీ నాయకులకు టీడీపీ పార్టీ కండువాలు కప్పి తెలుగు దేశం పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా దూడల మాధవరెడ్డిచే శంకర్‌రెడ్డికి గజమాలతో సన్మానం చేసి తమవంతు పార్టీకి బలోపేతం చేస్తామని దూడల మాధవరెడ్డి తన పంచాయతీకి న్యాయం చేయాలని కార్యకర్తలతో శంకర్‌రెడ్డికి తెలియజేశారు.



## 380మంది వేదవిద్యార్ధులు వస్త్రాలు

**తిరుమల,నవంబర్ 14(ప్రభాతవార్త)ప్రతినిధి:** ధర్మగిరిలోని వేదవిజ్ఞానం పీఠంలో వేదవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు 380మందికి టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వస్త్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ ఎం.లోకనాథం, వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పాశివసుబ్రమణ్యఅవధాని,వేదపండితులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శివయ్యకు అన్నాభిషేకం



సూళ్లూరుపేట, నవంబర్ 14 ప్రభాతవార్త: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేటలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి అన్నాభిషేకాన్ని భక్తులు భక్తిశ్రద్ధల తో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శుక్రవారం కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన అన్నాన్ని భక్తితో దేవస్థానం ప్రధాన అర్చకులు పేటేటి సునీల్‌కుమార్ శర్మ చేతులు మీదుగా స్వామివారికి అభిషేకం చేశారు. దేవస్థానం చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆట్రంబాకం దొరబాబురెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. అలాగే అభయ శంకర ఆలయంలోను స్వామివారికి అన్నాభిషేకం, ప్రత్యేక అభిషేకాలను అర్చకులు రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

## వాసవీ క్లబ్‌చే బాలల దినోత్సవం



సూళ్లూరుపేట, నవంబర్ 14 ప్రభాతవార్త: సూళ్లూరుపేట లోని వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర పాఠశాలలో శుక్రవారం చాచా నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వాసవీ, వనితా క్లబ్‌లకు చెందిన బండారు శబరీష్ గుప్తా, కుప్పల సాయిరాం, దరిశి గోపీకృష్ణ, కొత్తూరు శ్యాంసుందర్, మురుగుపూడి పద్మజ, సునీత, సౌజన్య, పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయులు గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



శ్రీసిటీ (తడ),నవంబర్ 14 ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వుల మేరకు సూళ్లూరుపేట లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ మరియు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కుమారి సంయుక్త ఆధ్వర్యంలో తడ పట్టణంలోగల కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు కె.ధర్మప్రసాద్, పి.లక్ష్మయ్య, నత్తం శ్రీనివాసులు, చక్రవర్తి, మధుకర్ మరియు కె.జి.బి.వి కళాశాల ప్రిన్సిపాల్ ఎంఈఓలు వేములు, మల్లికార్జున పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

శ్రీసిటీ (తడ),నవంబర్ 14 ప్రభాతవార్త: మండల పరిధిలోని పాఠశాలల్లో బాలల దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు విద్యార్థులు స్వాతంత్ర సమరయోధులు జాతీయ నాయకుల వేషధారణతో అలరించారు బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అటల పోటీలతోపాటు స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను వివరించారు పల్లిపాలెం ప్రైమరీ పాఠశాల వేడుకల్లో ఎంఈఓలు వేములు, మల్లికార్జున రావు, ఉపాధ్యాయులు గౌరీ, సుధాకర్, భువనేశ్వరి, శారద, ఎస్ఎంసి చైర్మెన్ రాసుద్దీన్ పాల్గొన్నారు.

## శ్రీపతి బాబుకు ఘనసన్మానం

నాయుడుపేట రూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త: ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబును ఆయన మిత్రులు ఘనంగా సన్మానించారు. నాయుడు పేట పట్టణంలోని ఎస్సీ కమిషన్ సభ్యులు శ్రీపతి బాబు నివాసంలో శుక్రవారం ఆయనను పలువురు మిత్రులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీపతి బాబు మిత్రులు మేర్లపాక కిషోర్ ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. కిషోర్ మాట్లాడుతూ తన మిత్రుడు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులుగా నియామకం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయన అంకిత భావంతో పనిచేసి మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## బస్సుల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

నాయుడుపేట రూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త: ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాల వారు నిబంధనలు పాటించాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నాయుడుపేట అర్బన్ పోలీసుస్టేషన్‌లో విలేఖరులతో మాట్లాడారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. తిరుపతి నుంచి విజయవాడకు వెళుతున్న ఇంటర్ సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా, అతను మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు సంబంధించిన రికార్డులు ఉంచుకోవాలన్నారు.

## వేనాడులో గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీసిటీ (తడ),నవంబర్ 14 ప్రభాతవార్త: తడ మండలం వేనాడు గ్రామంలో గ్రంథాలయం నందు శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు ప్రతి ఏడాది నవంబరు 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తారు అందులో భాగంగా మొదటిరోజు గ్రంథాలయ సిబ్బంది కళ్యాణి గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## ఘనంగా బాలల దినోత్సవం



కోట, నవంబర్ 14 ప్రభాతవార్త: భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను శుక్రవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటలో జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ మస్తానయ్య పాల్గొన్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని పేర్కొన్నారు. పిల్లలు విలువైన వనరులని చెప్పారు. చెందోడు గ్రామంలో ఎంఇఒ సుజాత, ఉపాధ్యాయులు వెంకటరావు, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు. చిన్నారులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. వేడుకలను ఎంఇఒ మస్తానయ్య పర్యవేక్షించారు.

## రైతులకు అందుబాటులో యూరియా

కోట, నవంబర్ 14 ప్రభాతవార్త: మండలంలోని రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉందని వాకాడు ఎఎంసి ఛైర్మన్ ప్రమీల అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గూడలి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో యూరియా ఆమె చేతులు మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకులు యూరియా లేదని, కొరత ఉందని అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్, విస్తరణ అధికారి సాయి తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడు అరెస్ట్

కోట, నవంబర్ 14 ప్రభాతవార్త: కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామానికి చెందిన శిరీష అనే మహిళను తన భర్త ఏడుకొండలు దౌర్జన్యం చేసి వేధించడమే కాకుండా ఆమె తల్లి ఇంట్లో ఉన్న వస్తువులను పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఈ క్రమంలో శుక్రవారం నిందితుడు ఏడుకొండలును పోలీసులు అరెస్టు చేశారు.

## 16న చెందోడులో రక్తదాన శిబిరం

కోట, నవంబర్ 14 ప్రభాతవార్త: మండలం చెందోడు గ్రామంలో ఈ నెల 16న ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంతో రక్తదాన శిబిరం జరుగుతుందని ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు లీలా మోహన్‌కృష్ణ తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొనే రక్తదాతలకు బ్లడ్ గ్రూప్ తెలియజేసే సర్టిఫికెట్‌తో పాటు ఒక ఫ్లాస్కో బహుమతిగా ఇస్తారని తెలిపారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా పదివేలకు పైగా సేవా కార్యక్రమాలను తమ సంస్థ నిర్వహించిందని లీలామోహన్‌కృష్ణ తెలిపారు.

## రైతు సేవ కేంద్రాలలో సామాజిక తనిఖీ



పెళ్లకూరు నవంబర్ 14 ప్రభాతవార్త : మండలం లోని పెళ్లకూరు రైతు సేవ కేంద్రం నందు ఈ పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహిం చడం జరిగింది. తనిఖీలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం నాగార్జునసాగర్ రైతులను ఉద్దేశించి మాట్లాడు తూ తనిఖీలు నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు, పెళ్లకూరు మండలాలలో ఈనెల 14వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పంట నమోదు ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఏవో విజయభారతితో పాటు ఏఈఓ.పుట్టయ్య, అశోక్, రైతులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



బాలాయపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ, సొసైటీ అధ్యక్షులు సింగంశెట్టి భాస్కరరావు తెలిపారు. జయంపు సొసైటీలో 20 టన్నుల యూరియా సొసైటీ అధ్యక్షులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు రైతుల కోసం కేంద్రంతో మాట్లాడి యూరియా అవసరమైన బస్తాలు రైతులకు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బట్టేపాటి మురళి మోహన రెడ్డి, అమ్మినేని ఆదిశేషయ్య, మహేష్ నాయుడు, మాధవ నాయుడు, రఘురెడ్డి, వేమూరు మీరారెడ్డి, ముద్దా శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బీహార్‌లో బిజెపి విజయం... శ్రీకాళహస్తిలో సంబరం



శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త: బీహార్ ఎన్నికల్లో బిజెపి కూటమి అఖండ విజయం సాధించటంతో శ్రీకాళహస్తిలో బిజెపి శ్రేణులు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారథ్యంలో సంబరాలు జరుపుకున్నారు. బీహార్ ప్రజల హృదయాలను ప్రధాని నరేంద్రమోదీ గెలిచారని కోలా ఆనంద్ అన్నారు. శుక్రవారం కూడలి ప్రాంతాల్లో బిజెపి కార్యకర్తలు చేతిలో జెండాలు పట్టుకొని బాణ సంచా కాలుస్తూ ర్యాలీలు నిర్వహించారు.ప్రధాని అందిస్తున్న ప్రజారంజక పాలనకు స్పందించిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి చిలకా రంగయ్య,పిళ్ళారి బత్తినయ్య, గరికపాటి రమేష్‌బాబు,సొట్టా సుకుమార్, మోహన్ వాసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప సారథ్యంలో శ్రీరామనగర్ కాలనీలో సంబరాలు జరిపారు. భారీ ఎత్తున బాణ సంచా కాల్చారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర సభ్యురాలు కండ్రిగ ఉమ తిరుపతిజిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఉమాసింగ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి విరాళం



శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం లో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేషస్పందన వస్తుంది.ఈ నేపథ్యంలో శుక్రవారం సి. చంద్రప్ప, కళ్యాణి దంపతులు రూ.50వేలు విరాళంను అందించారు. విరాళం మొత్తాన్ని ఎఇఓమోహన్‌కు అందించారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనాలతో పాటు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## కైలాస ధామంలో యంత్ర సామగ్రి కి పటిష్ట నిర్మాణం

**ప్లానింగ్ నిపుణులతో ఎంఎల్ఏ పులివర్తి నాని**

చంద్రగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త: కైలాస ధామంలో యంత్ర సామగ్రిని అమర్చేందుకు అవసరమైన పటిష్ట(ఫ్లాట్ ఫాం)నిర్మాణం కొరకు శుక్రవారం ఎంఎల్ఏ పులివర్తి నాని ఇక్కడికి చేరుకుని పరిశీలించారు. చారిత్రాత్మక చంద్రగిరిలో ఎంఎల్ఏ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కైలాస ధామం పనులు నిర్విర్వామంగా చేయిస్తున్నారు. ఈ నేపధ్యంలో మరో వారం రోజుల్లో దహన క్రియలకు వినియోగించే యంత్ర సామగ్రి చేరుకోనుండటంతో ప్లానింగ్ నిపుణులతో ఎంఎల్ఏ సమీక్షించారు. యంత్ర సామగ్రిని అమర్చడానికి పటిష్టమైన పునాధులతో కూడినస్ట్రక్చర్‌ను నిర్మించనున్నారు. ఇందుకు వాస్తు నిపుణులతో పరిశీలింపజేసి వేధికను నిర్ణయించాలని అన్నారు. ఈ నేపధ్యంలో విరాళాల సేకరణలో మరింత చురుగ్గా పనిచేయాలని కైలాసధామం కమిటీ సభ్యులకు సూచించారు.

## భారతదేశంలో ఫార్మసీ రంగం అభివృద్ధి చెందుతుంది

**చదలవాడ రమణమ్మ ట్రస్టీ సభ్యులు వరుణ్ సాయి**



తిరుపతి విద్య నవంబర్ 14 ప్రభాతవార్త: స్థానిక రేణిగుంట రోడ్డులో ఉన్న కృష్ణా తేజ ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మ్,ఫార్మ్.డి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమం విజయవంతం అయ్యిందని కృష్ణ తేజ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జయ శంకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు.ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ జయశంకర్ రెడ్డి అధ్యక్షతన జరగగా ముఖ్య అతిధిలుగా చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల ట్రస్ట్ మెంబర్ వరుణ్ సాయి,కళాశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ భాస్కర్ పటేల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వరుణ్ సాయి మాట్లాడుతూ భారతదేశంలో ఫార్మసీ రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు వృత్తి నైపుణ్యంతో పాటు క్రమశిక్షణ,మానవతా విలువలతో ముందుకు సాగాలన్నారు.ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జయశంకర్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణ తేజ ఫార్మసీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక ప్రయోగశాలల సదుపాయాలు,పరిశోధనావకాశాలు,విద్యార్థి వ్యక్తిత్వ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు అందిస్తోందని తెలుపుతూ,విద్యార్థులకు కళాశాల అకాడమిక్ నియమాలు,కోర్సు నిర్మాణం,లైబ్రరీ, ప్రయోగశాలలు,ప్లేస్‌మెంట్ శిక్షణ,క్యాంపస్ సదుపాయాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కూడా పాల్గొని,కళాశాల బోధనా ప్రమాణాలు, విద్యార్థుల పట్ల చూపుతున్న శ్రద్ధ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి,అన్ని విభాగాల హెచ్ ఓడిలు, కళాశాల విభాగాధిపతులు, ఇతర అధ్యాపకులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు అండగా టిడిపి ప్రభుత్వం

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, నవంబరు 14 ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ అన్నారు. నియోజకవర్గంలో అనారోగ్య ంతో చికిత్స పొందుతున్న బాధితులకు శుక్ర వారం ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మొత్తం రూ. 2,49,354 లక్షలు పంపి ణీ చేశారు. నగరి రూరల్ మండలం వేలావడికి చెందిన జె.హరీష్‌కు రూ. 31,310 వేలు, గొల్లకండ్రిగకు చెందిన కె.చెంగల్‌రాయలుకు రూ. 32,500, చిన్నతాంగేల్ నివాసి పవిత్రకు రూ. 75,000 వేలు, వి.ఎన్.ఆర్.పేటకు చెందిన పి.మురళికి రూ. 81,000, విజయపురం మండలం పి.ఆర్.కండ్రిగకు చెందిన ఎస్.ఆర్.శశికళకు రూ. 29,544 వేలు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు.

## సరకుల నాణ్యతను పరిశీలించిన బోర్డు సభ్యుడు



శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాల యంలో నిత్యాన్నదానం పథకం,ప్రసాదాలకు ఉపయోగిస్తున్న నిత్యావసర సరకులను శుక్రవారం ఆకస్మికంగా ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి తనిఖీ చేసారు. భోజనానికి వాడుతున్న బియ్యం, సాంబారుకు వాడుతున్న కందిపప్పు తదితర వస్తువులను తనిఖీ చేసినట్లు వివరించారు. అలాగే సరఫరా అవుతున్న సరకుల జాబితాలో పేర్కొన్నట్లు వస్తువులు ఉన్నాయా? లేదా? అని రిజిస్టర్లను తనిఖీ చేసారు. స్టోర్స్ గుమాస్తా షణ్ముగంను వివరాలు అడిగి తెలుసుకున్నారు.స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాలతో తనిఖీలు జరిపినట్లు గుర్రప్పశెట్టి వివరించారు.

## మునిసిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు



పుత్తూరు, నవంబరు 14 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపాలిటీ నూతన కమిషనర్‌గా శుక్రవారం డి.వి.నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. కావలి మునిసిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై పుత్తూరుకు కమిషనర్‌గా వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన ఎం.మంజునాథ్ గౌడ్‌కు బదిలీ జరిగిన విషయం తెలిసిందే.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరిన జనసేన నాయకులు

గూడూరు, నవంబర్ 14 ప్రభాతవార్త: చిట్టమూరు మండలం కోగిలి గ్రామంలో హరిజనవాడ శ్మశానంకు వెళ్ళే రోడ్డును అభివృద్ధిచేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి పలు సమస్యల పై వినతిపత్రం అందచేశారు. కోగిలి గ్రామంలో మృతి చెందిన వారిని శ్మశానంకు తీసుకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సరిగా లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే చిన్నపాటి వర్షానికి శ్మశానం కు వెళ్ళే దారిలో నడుము లోతు నీరు నిలబడడం ఆ నీటిలోనే మృతదేహాన్ని తీసుకు వెళ్ళాల్సి వస్తుందన్నారు. అలాగే ఎస్ఆర్ఏ టాకీస్ నుండి విందూరు పోయే రోడ్డు మార్గం గతుకులమయంగా మారిందన్నారు. గూడూరు మండలం చవటపాలెం నుంచి దివిపాలెం వెళ్లే మార్గంలో రోడ్డును గత ప్రభుత్వం అభివృద్ధి పరచకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారనీ కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లు అభివృద్ధి కొరకు కృషి చేయాలని జనసేన పార్టీ తరపున వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విజయ్, సాయికిరణ్, నవీన్ కుమార్, కార్తీక్, రవి, సునీల్, లతీఫ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫెలోషిప్ అందజేత

గూడూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : స్థానిక డి ఆర్ డబ్ల్యు కళాశాల నందు శుక్రవారం 14 నవంబర్ తేదీన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నందు విద్యార్థులకు అందుబాటులో ఉన్న పీజీ కోర్సుల వివరాలను తెలియజేశారు. ఈ కోర్సుల వివరములతో పాటుగా మెరైన్ బయాలజీ కోర్స్ నందు విద్యార్థులకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, ఈ కోర్సులో సీటు సాధించిన 15 మంది మెరిట్ విద్యార్థులకు నెలకు పదివేల రూపాయల ఫిలోషిప్, పది నెలల పాటు రెండు సంవత్సరాలు అందిస్తున్నట్లుగా తెలియజేశారు. చదువుకుంటుండగా నాలుగవ సెమిస్టర్ నందు ఇంటర్ షిప్ చేస్తున్నప్పుడు ఆరు నెలల పాటు ప్రతినెల 5000 రూపాయలు చెల్లిస్తారని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమము నందు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి సంబంధించిన ప్రొఫెసర్ సిహెచ్ విజయ, డాక్టర్ హనుమా రెడ్డి, డాక్టర్ వెంకట్రాయులు, డిఆర్డబ్ల్యు కళాశాల ప్రిన్సిపల్ రొటేరియన్ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గాయత్రి, పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలి : ఎమ్మెల్యే



పెళ్లకూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : శ్రీ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని పెళ్లకూరు ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు శుక్ర వారం నాడు నిర్వహించిన ఈ బాలల దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ శ్రీ ముందుగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తదుపరి పిల్లలతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాల గురించి ఉపాధ్యాయులందిస్తున్న విద్యా బోధన గురించి అనేక విషయాల గురించి విద్యార్థులుతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకుని మీ తల్లిదండ్రులకు మీ గురువులకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, మండల తెదప అధ్యక్షులు సంచి కృష్ణయ్య బిజెపి అధ్యక్షులు కలిచేటి నరసింహులు తేదాపా సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు ఎంపీడీవో ప్రమీలరాణి మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, శంకరయ్య, మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యాచేంద్ర ఆశయ సాధనకు కృషి చేస్తాం

**- యువరాజు సర్వజ్ఞ కుమార యాచంద్ర**



వెంకటగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త: మా తాత మాజీ ఎమ్మెల్యే వివిఆర్కె యా చ్వేద్ర ఆశయ సాధనకు కృషి చేస్తామని ఆయన మనవడు యువరాజ వి. సర్వజ్ఞ కుమార యాచేంద్ర తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వివిఆర్కే యాచేంద్ర జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వెంకటగిరిని అభివృద్ధి చేయాలనే మా లక్ష్యం అని తెలిపారు. వెంకటగిరి ప్రజలు ఎప్పుడు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వెంకటగిరిని విడిచి పెట్టరాదని మా తాత ఎప్పుడూ చెప్పేవారే గుర్తు చేశారు. టౌన్ క్లబ్ అధ్యక్షులు లక్కమనేని కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజాలు వారి ఆస్తులను పేదలకు ఇచ్చారని చెప్పారు. ప్రజలు రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని చెప్పారు. పేదలకు ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్, రాజేశ్వరరావు, బాలాయపల్లి ఎంపీపీ భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు ధనియాలు రాదా, ఎంఏ నారాయణ, నాయకులు ఆనంద్, మురళీకృష్ణ, మధు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేగేటు మరమ్మతుల పనుల్లో జాప్యం

నాయుడుపేట రూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్ఆర్ కాలనీ, విన్నమాల గిరిజన కాలనీల వాసులు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్ఎస్ఆర్ కాలనీ, విన్నమాల గిరిజన కాలనీ వద్ద రైల్వేగేటు మరమ్మతుల పనులతో కాంట్రాక్టర్లు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద ఉన్న 78 నంబర్ రైల్వేగేటు ఉందని, అక్కడ మరమ్మతుల పేరుతో గేట్లు మూసి వేశారని తెలిపారు. ఆ గేటు ద్వారా ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. అలాగే ఉదయం నిద్రలేచికూలీకి పోయే వారు స్కూళ్లు, కాలేజీలకు రాకపోకలు సాగించే విద్యార్థులు సుమారు 5 కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితి ఉందని తెలిపారు. ఏదైనా ప్రమాదం ఆసుపత్రికి వెళ్లాలన్నా, టౌన్‌కి వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. తమ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని కోరారు. దీనిపై ఎమ్మెల్యే విజయశ్రీ స్పందిస్తూ త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడుకు చందు, గోవిందు శ్రీనివాస్, జడ వెంకటేష్, కప్పల మునస్వామి, దారా శేఖర్, మోహన్, అశోక్, వెంకటేశ్వర్లు, పెంచలయ్య తదితరులు ఉన్నారు.

## ఢిల్లీ పేలుళ్లతో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



వెంకటగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త : ఢిల్లీలో ఉగ్రవాదులు బాంబులు పేల్చిన సందర్భంగా వెంకటగిరి పట్టణంలో డాగ్ కార్డు ద్వారా సీఐ ఏవి రమణ తనిఖీలు నిర్వహించారు. ఢిల్లీలో బాంబు పేలినందున అన్ని ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ ఏవి రమణ తెలిపారు. పార్సిల్స్ గోడౌన్లను తనిఖీ చేశారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఉచిత గర్భ కోశ వ్యాధులు చికిత్స



వాకాడు, నవంబర్ 14 ప్రభాతవార్త: మండలం లోని దుగారాజపట్నం గ్రామము లో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం రైతు సేవా కేంద్రం నందు జరిగింది. ఈ శిబిరంలో శ్రీనివాసులు మాట్లాడుతూ ఫార్మర్‌కి రెస్పెక్ట్ ఇవ్వండి మీరు ట్రీట్మెంట్ చేయకపోయినా శిబిరం నందు నట్టల నివారణకు మందులు, యదకు రాని పశువులకు మందులు, చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎపిఎల్‌డిఏ కోవూరు డిప్యూటీ డైరెక్టర్ దాసరి శ్రీనివాసరావు, లింగ నిర్ధారణ విధాన వీర్యం గురించి గర్భ కోశ వ్యాధులు వాటి నివారణ పద్ధతులు గురించి వివరించడం జరిగింది. డా. సిహెచ్ కృష్ణా రావు మాట్లాడుతూ వాకాడు మండల పరిధిలో రైతు సేవా కేంద్రంలో పని చేస్తున్న ఏహెచ్ఏల ద్వారా, పారా స్టాఫ్ సేవలను వినియోగించుకోవాలని. వాకాడు ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా.సిహెచ్ మంజుల, వాకాడు మండల పశువైద్యుల్బుడా. కృష్ణారావు, కోట మండలం పశువైద్యులు డా.ఎంబేటి. రాజేష్, మనుబోలు మండలం పశు వైద్యులు డా.ఎస్.కె. షరీఫ్, ఇతర పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయంను తనిఖీ చేసిన ఎంపీడీవో

వాకాడు, నవంబర్ 14 ప్రభాతవార్త: మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఉన్న సచివాలయాన్ని, అంగన్వాడి కేంద్రాన్ని శుక్రవారం ఎం.సాయిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉన్న పలు రికార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్ మరియు పిల్లలు అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సి.హెచ్ సురేష్ బాబు సచివాలయ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పి.భారతి పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం చైర్మన్ అర్చన



చిల్లకూరు, నవంబర్ 14 ప్రభాతవార్త: చిల్లకూరు మండలంలో వెలసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని ఆలయ చైర్మన్ కందల అర్చన అన్నారు. శుక్రవారం మండలంలోని కలకొండ కొండపై వెలసి ఉన్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు అయిన చైర్మన్, కమిటీ సభ్యులు ఈవో రవి కృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఆలయ ఆవరణంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేయాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పూజలు అందించాలని దాతలు ముందుకొచ్చి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దొంతి వెంకటసుబ్బయ్య, కొండాపురం ముత్యాలమ్మ పెరంబుదురు వాసవి, బూదూరు ఆదిశేషమ్మ, ముడి చెంగల్ రాయుడు, చింత పూడి చలపతి, కొండేటి వెంకటేశ్వర్లు, కడింపాటి రాజమ్మ ఆలయ అర్చకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.77 కోట్లు ఆదాయం



కాణిపాకం, నవంబర్ 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.77 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. గురువారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. 28 రోజులకు గాను హుండీల ద్వారా 1,76,77,666 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 53 గ్రాముల బంగారు, ఒక కిలో 790 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 15,103 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 21,673 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 1357 అమెరికా డాలర్లు, 145 యూఏఈ దినార్స్, 5 కెనడా డాలర్లు,15 యూరో కరెన్సీ,235 ఆస్ట్రేలియా డాలర్లు, 35 ఇంగ్లాండ్ ఫౌండ్స్ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనుంజయ, ధనపాల్, ప్రసాద్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలి.!

**రామకృష్ణ ఆశ్రమ కార్యదర్శి సుకృతానంద స్వామీజీ**

రామచంద్రాపురం, నవంబర్ 14 ప్రభాతవార్త: విద్యార్థులు పట్టుదల, స్వయంకృషితో ముందుకు సాగాలని రామకృష్ణ ఆశ్రమ కార్యదర్శి సుకృతానంద స్వామీజీ అన్నారు. శుక్రవారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాలలో డి ఫార్మశీ, ఫార్మా డి, మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీ జీ మాట్లాడుతూ ఫార్మశీ రంగానికి ప్రపంచంలో ఉజ్వల భవిష్యత్తు వుందన్నారు. ఔషధాల తయారీలో నూతన ఒరవడులను సృష్టించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భక్తవత్సం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు, పరిపాలనా డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, తదితరులు పాల్గొన్నారు.